వణికిస్తున్న విషజ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- రాత్రి,పగలు తేడా లేకుండా విజృంభిస్తున్న దోమలు
- పారిశుధ్యంపై పట్టని అధికారులు


శ్రీనివాసపురం వద్ద తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం


ప్రభుత్వాసుపత్రిలో బారులు తీరిన రోగులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో విషజ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలో దాదాపు 36వార్డులు, 78 కాలనీలు, 32 వేల కుటుంబాలు దాదాపు 1.30 లక్షల జనాభా ఉంది. దోమల బెడదకు తోడు వాతావరణంలో మార్పులు రావడంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రులకు జనాలు క్యూ కడుతున్నారు. ప్రధానంగా రోజూ వందల మంది జ్వర బాధితులు ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జ్వర పీడితుల్లో చిన్నపిల్లలు అధికంగా ఉండటం గమనార్హం.

దోమల నివారణ చర్యలేవీ?

పట్టణంలోని కొన్ని శివారు ప్రాంతాలు మురికి కూపాలుగా మారడంతో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంది. ముఖ్యంగా పోరాటకాలనీ, బిందెలకాలనీ, నందలపాడు, శ్రీనివాసపురం, చేనేత కాలనీ, బస్టాండ్ ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమల బెడద అధికమైంది. దోమ కాటుతో మలేరియా, డెంగీ తదితర జ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమల వ్యాప్తిని అరికట్టాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దోమల బెడదతో జ్వరాలు



“ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. జ్వరం ఎంతకూ తగ్గకపోవడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా. మా ఇంటి వెనుకాల పెద్ద మురుగు కాలువ ఉంది. అక్కడి నుంచి విపరీతంగా దోమలు వస్తున్నాయి. దోమల బెడదతో కాలనీలో ఎక్కువ మందికి జ్వరాలు వస్తున్నాయి.

– ప్రీతి, పోరాట కాలనీ

వైరల్ ఫీవర్లున్నాయి..



పట్టణంలో వైరల్ ఫీవర్లు వస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా దగ్గు, జలుబుతో కూడిన జ్వరాలు వస్తున్నాయి. దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఇంటి పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యంపై కనీస అవగాహన కల్గి ఉండాలి.

– డేనియల్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, తాడిపత్రి

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ హెచ్చరించారు. గురువారం కొత్తపేట గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓతో కలిసి డీఎల్‌డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. రోజు ఉదయం 9.30 గంటలకు, సాయంత్రం 5.30 గంటలకు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల పనులు పూర్తి చేయించండి


మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: పశువుల షెడ్ల పనులు పూర్తి చేయించాలని లేనిపక్షంలో అనుమతులు రద్దవుతాయని ఏపీఓ షబ్బీర్‌బాషా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏపీఓ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఇంకుడు గుంతలు విరివిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. హార్టికల్చర్ కింద మొక్కలు నాటుకున్న రైతులు 100 శాతం మొక్కలను బతికించుకోవాలని లేకుంటే బిల్లులు చెల్లింపులు జరగవన్నారు. జాబ్‌కార్డుల కలిగిన కూలీలు 100 పని దినాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాదికి పంచాయతీల్లో పనులను గుర్తించాలన్నారు. ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్ , శంకర్, జయరాం, అదిల్ , శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గార్లదిన్నె: కౌమార బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం రాష్ట్రీయ బాల ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు జరుగుతున్న ఆరోగ్య వైద్య పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం జాతీయ రుతుక్రమ దినోత్సవం సందర్భంగా కౌమార పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తపోటు, మధుమేహం, మానసిక జబ్బులు, నోటి క్యాన్సర్‌పై పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి వివరించారు. ప్రోగ్రామ్ మేనేజర్ రజిత, పాఠశాల హెచ్‌ఎం గ్రీసమ్మ, ఎంపీహెచ్‌ఈఓ నాగేశ్వరయ్య, ఏఎన్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు న్యాయం చేయండి


మున్సిపల్ డీఈకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: వివిధ కారణాలతో విధులకు హాజరు కాలేని కార్మికుల కుటుంబ సభ్యులను పనుల్లోకి తీసుకొని వారి నాయ్యం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.వీరభద్రస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మున్సిపల్ డీఈ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పబ్లిక్ హెల్త్‌లో పనిచేసే 40 కార్మికులు 2021 వివిధ కారణాలతో విధులకు హాజరుకాలేదన్నారు. వారి స్థానంలో వారి వారసులను పనుల్లోకి తీసుకోవాలని అప్పట్లో మున్సిపల్ కౌన్సిల్ కూడా ఆమోదించిందన్నారు. అయితే ఆన్‌లైన్ సమస్యలతో పెండింగ్‌లో ఉందన్నారు. ఇటీవల యాప్ అందుబాటులోకి వచ్చిందని, వారి వారసులను పనుల్లోకి తీసుకోవాలని కోరారు. క్లాప్ ఆటోడ్రైవర్లకు జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న యూనిఫారం, చీరలు, పాదరక్షలు, సబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు చిన్న కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్తసేకరణ క్రమంగా జరగాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటా చెత్తసేకరణ క్రమంగా జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. గురువారం ఉదయం కమిషనర్ 60 అడుగుల రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తసేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అని స్థానికులను ఆరాతీశారు. అలాగే డివైడర్ల మధ్య నాటిన చెట్లకు నీరు పోయాలని వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన రాధాకృష్ణ

గుత్తి రూరల్: వన్నేదొడ్డి గ్రామ శివారులో పవర్‌గ్రిడ్‌కు సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన వంకదారి రాధాకృష్ణ దుకాణాలకు బియ్యం, కిరాణా సరుకులు సరఫరా చేసేవాడు. ఈ క్రమంలో గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలోని దుకాణాల్లో బియ్యం, కిరాణా సరుకులకు సంబంధించిన కలెక్షన్ కోసం వచ్చి తిరిగి ప్యాపిలికి వెళ్తుండగా ఎన్టీపీసీ సమీపంలోని మలుపు వద్ద గుత్తి వైపునకు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఎదురుగా వేగంగా వచ్చి రాధాకృష్ణ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో నుంచి రాధాకృష్ణ ఎగిరి రోడ్డుపై పడి తల, మొహం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాడిపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అందరం కలిసికట్టుగా పని చేసి తాడిపత్రి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన తన నివాసంలో నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వెళ్లి సమస్యలను గుర్తించి డిసెంబర్ 10లోపు నివేదికను అందించాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా 50 శాతం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే తానే స్వయంగా రంగంలోకి దిగుతానన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగిస్తాం


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుత్తి ఆర్‌ఎస్‌లో పూలే వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప అన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆ మహనీయుడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సుంకప్ప మాట్లాడుతూ దేశంలో సామాజిక విప్లవానికి పునాదులు వేసిన గొప్ప వ్యక్తి పూలే అని ఆయన కొనియాడారు. ఆనాడు పూలే ఆశయాలకు అనుగుణంగా జగనన్న బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పాటుపడ్డారని కానీ నేడు ఎన్‌డీఏ కూటమి పాలకులు పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు వీరేష్, సంపత్‌ఆచారి, పార్టీ నాయకులు ఎండీ.ఖలీల్, ప్రతాప్, చిన్నరాయుడు, శాంతనాయుడు, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణ, అమీర్, సాధిక్, బాషా, నరసమ్మ, జామిని పాల్గొన్నారు.

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని గురువారం బీఎస్పీ, బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐ యుగంధర్ మాట్లాడుతూ పూలే సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్తగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ నేతలు బీ వెంకటయ్య, తూర్పింటి మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకులు సాకే ఓబులేసు, మండ్ల రాజు, బీసీ సంఘం నాయకులు ఓబులేసు యాదవ్, వాల్మీకి గోపాల్, నారాయణమూర్తి, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.


బీకేఎస్‌లో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ పుణ్యవతి

బుక్కరాయసముద్రం: మహాత్మా జ్యోతిరావు పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ పుణ్యవతి పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పూలే విగ్రహం వద్ద 134వ వర్ధంతి నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, పూల నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కాటమయ్య, బీసీ సెల్ నాయకులు చంద్రమోహన్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. పూలే ఆశయ సాధన కోసం కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, రంగస్వామి, కౌన్సిలర్ వరదరాజులు, సీనియర్ నాయకులు కెఎం రంగనాయకులు, జీఎం బాషా, భీమలింగ, హరినాథ్ రెడ్డి, శివ, మల్లి, రామాంజనేయులు, కుమార్, టి.రంగస్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావుపూలే అని గ్రంథాలయ అధికారి కృష్ణ, ఓబీసీ నాయకులు చరణ్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయంలో మహాత్మాజ్యోతిరావు పూలే గారి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఆదిశేషు, ఏఆర్ స్వామి యాదవ్, పుల్లయ్య, చిన్న ఆంజనేయులు, పెద్దిరాజులు, రంగన్న పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డగింత


స్మార్ట్ మీటర్లు అమర్చే వారితో వాగ్వివాదానికి దిగిన సీపీఎం నాయకులు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో దుకాణాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని గురువారం సీపీఐ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ప్రజల నెత్తిన భారం మోపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాయని సీపీఐ మండల సీనియర్ నాయకుడు నారాయణ, మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి విమర్శించారు. అధికారులు తక్షణమై మీటర్లు అమర్చే ప్రక్రియను ఆపివేయాలని డిమాండ్ చేశారు.

2న బుగ్గ సంగమేశ్వరాలయం హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: బుగ్గ సంగమేశ్వరాలయంలో డిసెంబర్ 2న హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ క్రిష్ణయ్య గురువారం తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గ్రామపెద్దల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మాలధారులకు అన్నదానం

యాడికి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం హోసూర్ గ్రామానికి చెందిన కండే పాండురంగయ్య అయ్యప్ప, శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. 300మందికి అన్నదానం ఏర్పాటు చేసిన పాండురంగయ్యను మాలధారులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీధర్, పవన్ వాసు, రవితేజ, సురేష్, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పని చేయండి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పని చేయాలని ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంపీపీ బీవీ మాధవితో కలిసి నూతనంగా ఎంపికైన ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామకపత్రాలు అందజేశారు. ప్రస్తుతం 18 పంచాయతీలకు 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించామని, మిగతా పంచాయతీలకు త్వరలో నియమిస్తామని ఎంపీడీఓ తెలిపారు.


ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను అందిస్తున్న దృశ్యం

చెత్తబుట్టల పంపిణీ


చెత్త బుట్టలను అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఇంటింటికి చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశారు. సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఒక్కో ఇంటికి మూడు బుట్టలు పంపిణీ చేశారు. ఇళ్లలోని చెతను బుట్టల్లో వేసి మున్సిపల్ చెత్త వాహనాలకు అందజేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు వినయ్, రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

గుంతకల్లు: రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన కసాపురం రోడ్డులో ఇటీవల చేపట్టిన రోడ్డు పూడ్చివేత పనులను పరిశీలించారు. రోడ్డుపై పూడ్చిన గుంతాలను చేతులు, కాళ్లతో రద్దుతోనే పగుళ్లు వస్తున్నాయన్నారు. రోడ్డు పూడ్చివేత పనులపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా వేసిన రోడ్డు పోతేనే కదా మళ్లీ కొత్త రోడ్డు వేస్తాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ కూడా సరిగా సమాధానం చెప్పడం లేదన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి తగరం రామాంజినేయులు, జిల్లా జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, నాయకులు రామచంద్ర, షేక్ మహబుబ్‌బాషా, యూసుఫ్, దాసరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి దాత అంగీకారం


దాతకు ప్రసాదం అందిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వ్యయంతో నూతన గోశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వర్ సింగ్ అంగీకరించినట్లు ఆలయ ఈఓ వాణి గురువారం తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో ఉన్న గోశాల షెడ్డు చిన్నది కావడంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో 4500 అడుగుల విస్తీర్ణంలో నూతన గోశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఆలయ అధికారులు దాతల సహాయం కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయ ఈఓ ఆదేశాల మేరకు ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు, అర్చకులు చక్రవర్తి స్వామి, హరిచరణ్ స్వామి గురువారం హైదరాబాద్‌లోని పరమేశ్వర్ సింగ్‌ను కలిశారు. ఆయన వెంటనే గోశాల నిర్మాణానికి అంగీకరించినట్లు ఈఓ తెలిపారు.

ఆధార్ లింక్‌తో డబ్బు జమ కాదు

తాడిపత్రి అర్బన్: ఐపీపీబీ ఖాతాలు కలిగి ఆధార్ లింక్ అయినంత మాత్రాన డబ్బు జమ కాదని తాడిపత్రి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పోస్టుమాస్టర్ పి.రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. పోస్టాఫీసుల్లో ఖాతా తెరిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1500 నగదు పోస్టాఫీసు ఖాతాల్లో జమ అవుతుందని తాము ఎన్నడూ ప్రకటించలేదన్నారు. బ్యాంకుల్లో కాస్త ఆలస్యం అవుతుండడంతో తాము పోస్టాఫీసుల్లో ఆధార్ సీడింగ్ చేయాల్సి వస్తోందని తెలిపారు. బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న వారు పోస్టాఫీసులో ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

రైల్వే ఎస్‌ఐ బదిలీ

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే ఎస్‌ఐ (జీఆర్‌పీ) పి.విజయ కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు గుంతకల్లు రైల్వే ఎస్పీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోనున్నారు. ఆ తరువాత ఆయనకు ఏదో ఒక పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇస్తారు. ఆయన స్థానంలో ధర్మవరం రైల్వే ఎస్‌ఐగా పని చేస్తున్న కె.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

కంటి వైద్యశిబిరం


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యాడికి: రాయలచెరువు గ్రామంలో లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో 50 మందికి కంటి పరీక్షలు చేసి 26 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ, సభ్యులు రవి ప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, ప్రసాద్, శేషానందరెడ్డి, జయరామి రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రీజనల్ సెక్రటరీ ప్రతాప్ నారాయణ

గుత్తి: ఆర్టీసీ కార్మికుల సమ్యలన్నింటినీ పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్‌ఎంయూ) రీజనల్ సెక్రటరీ ప్రతాప్ నారాయణ డిమాండ్ చేశారు. గుత్తిలోని తాడిపత్రి రోడ్డు దర్గా ఆవరణలో గురువారం యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారేజీ, పీఎఫ్, ఫారం-డి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వంలో విలీనం తర్వాత ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ వంటి స్కీమ్‌లు పోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఓల్డ్ పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. గ్యారేజీలకు తగిన పనిముట్లు కేటాయించాలని, సిబ్బంది కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. యూనియన్ కమిటీ రీజనల్ మెంబర్ సుధాకర్, డిపో కార్యదర్శి ఎస్‌వీ రాముడు, ప్రెసిడెంట్ ఎంఆర్ గోపాల్, కోశాధికారి మురళీ మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, మధు, నారాయణ, జేఎస్ గిరి, దేవ్, రావు, సుంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోండి


అధికారులకు పిర్యాదు చేస్తున్న బొంబాయి రమేష్ నాయుడు

యాడికి: మండలంలోని పలుచోట్ల టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ రంగయ్య, గండికోట లక్ష్మణ్ మట్టి తరలించారని వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, మైనింగ్, రాయల్టీ, ఎండోమెంట్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తనపైన జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీపీ రంగయ్య రాయలచెరువు చెరువులో జేసీబీలు, హిటాచీలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకున్నాడన్నారు. భైరవకొండ వద్ద టీడీపీ నేత తన జేసీబీతో గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని ఈ ఏడాది జూన్ 17న ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చినదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాడికి ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, వార్డు సభ్యుడు తిరుపతి,నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం కేంద్రాలు నిర్వహించాలి


సిబ్బందికి సూచనలిస్తున్న సీడీపీఓ భారతి

యల్లనూరు: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని సీడీపీఓ భారతి సూచించారు. గురువారం మండల కేంద్రంలో సెక్టార్ సమావేశం ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.